నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, సోమవారం 16 డిసెంబర్ 2024 | JAGTIAL

# డిమాండ్లు నెరవేర్చాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశ కార్యకర్తలు

ముస్తాబాద్, డిసెంబర్ 15: పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, ఉద్యోగ ప్రయోజనాలు కల్పించాలని ఆశ కార్యకర్తలు డిమాండ్ చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని ఈ నెల 18న జిల్లా కేంద్రంలో తలపెట్టిన బస్ జాతకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ముస్తాబాద్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు 18 ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, నేటికీ నెలకు రూ.9,550 జీతంతో నెట్టుకొస్తున్నారని, కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 18న కళాజాతకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ యూనియన్ నాయకులు మంజుల, జమున, లక్ష్మి, దేవలక్ష్మి, దేవిక, జ్యోతిలక్ష్మి, నవిత వివిధ గ్రామాల ఆశ కార్యకర్తలు ఉన్నారు.

# పొద్దంతా ఇగమే



గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంచు

- వారం నుంచి పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- కోల్‌బెల్ట్‌లో కనిష్ఠంగా 11.6 డిగ్రీలు
- రోజంతా చల్లని గాలులు
- వణుకుతున్న జిల్లావాసులు



గోదావరిఖనిలో చలి మంటలు కాగుతున్న ప్రజలు

కోల్‌సిటీ, డిసెంబర్ 15 : వారం రోజుల నుంచి చలి భయపెడుతున్నది. మునుపెన్నడూ లేని విధంగా వణికిస్తున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఏకంగా 11 డిగ్రీలకు చేరువ కావడంతో ఎక్కడ చూసినా మంచుదుప్పటి పరుచుకుంటున్నది. రాత్రిళ్లే కాదు, పొద్దంతా ఇగం పెడుతున్నది. చల్లని గాలులతో వణుకు పుడుతుండగా, కోల్‌బెల్ట్‌లో మరీ దారుణంగా మారింది. ఉదయం 9గంటలు దాటినా మంచు కమ్మేసి ఉంటున్నది. పొద్దంతా ప్రజలు ఇండ్ల నుంచి రాలేని పరిస్థితి ఉంటుండగా, సాయంత్రం 5గంటల్లోపే రోడ్లపై సంచారం తగ్గిపోతున్నది. తుఫాను ప్రభావంతో మరో నాలుగైదు రోజుల పాటు చలి ప్రభావం తీవ్రంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

# జగిత్యాల గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డ



జగిత్యాల రూరల్ మండలం ధరూర్ చౌరస్తాలో నినదిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

## దాడిని ఎండగడుతం

నేను జగిత్యాలకు రావడానికి పెద్ద కారణమే ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి, బతుకమ్మ లేకుండా మన అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నడు. వాటిని అందరికీ వివరించి చెప్పడానికే వచ్చిన. తెలంగాణ తల్లి కేవలం ఒక్క కేసీఆర్ సృష్టి కాదు. అది సకల జనులు సమ్మిళితంగా రూపొందించుకున్న ఒక పవిత్రభావానికి రూపం. ఉద్యమ సమయంలో ప్రజలకు ధైర్యాన్ని, స్ఫూర్తిని రగిలించిన ఆ విగ్రహంలో రేవంత్ బతుకమ్మను తీసేసి, ఉద్యమ స్ఫూర్తిని లేకుండా చేస్తున్నడు. ఆయన సెక్రటేరియేట్‌లో ప్రతిష్ఠించిన మూర్తిని తెలంగాణ తల్లిగా సమాజం అంగీకరించే పరిస్థితిలో లేదు. బతుకమ్మ లేకుండా విగ్రహాన్ని రూపొందించడం అంటే ఇక్కడి ప్రజలను అవమానించడమే. ఎన్ని జీవోలు, ఎన్ని గెజిట్‌లు ఇచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా సమాజం భయపడబోదు. ఉద్యమ కాలంలో స్ఫూర్తిని రగిలించిన తెలంగాణ తల్లి విగ్రహాలను పల్లెపల్లెనా ప్రతిష్ఠిస్తం. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న దాడిని గ్రామగ్రామాన ఎండగడుతం. ఉద్యమతల్లిని కాపాడుకుంటం.


- కల్వకుంట్ల కవిత

- మళ్లీ గులాబీ జెండా ఎగిరితీరుతుంది
- పల్లెపల్లెనా తెలంగాణ తల్లి, బతుకమ్మ విగ్రహాలు నెలకొల్పుతం
- పార్టీ మారిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఏ ముఖం పెట్టుకొని అసెంబ్లీకి పోతడు
- ఏడాదిగా ఒక్క రూపాయి నిధినైనా తెచ్చిండా..?
- పైసల కోసం పోయేవారు ఏనాటికి నాయకులు కాలేరు
- డాక్టర్ సంజయ్‌కుమార్ గెలిచింది.. కేసీఆర్ బొమ్మపైనే
- రాహుల్‌గాంధీ వచ్చి ప్రచారం చేసినా, ఇక్కడి ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించలేదు
- జగిత్యాలలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ధరూర్ వద్ద ఎమ్మెల్సీ కవిత ప్రసంగం వింటున్న ప్రజలు



జగిత్యాల, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): 'జగిత్యాల గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డ అని మరోసారి ప్రజలు నిరూపించిన్రు. ఈ గడ్డకు నా ధన్యవాదాలు' అని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రగతికి అహర్నిశలూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో మళ్లీ గులాబీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. జగిత్యాలలో జరిగే అవినీతి, అక్రమాలపై అందరం కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సుదీర్ఘ సమయం తర్వాత ఆదివారం జగిత్యాలకు వచ్చిన ఆమెకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్సీ ధరూర్ శివారులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమీపంలోనే 22 అడుగుల ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ చేశారు. మహిళలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం బైక్‌ర్యాలీతో జగిత్యాలకు చేరుకొని, కొత్తబస్టాండ్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఆ తర్వాత సారంగాపూర్ కస్తూర్బా రెసిడెన్షియల్ పాఠశాలకు చేరుకున్నారు. అంతకు ముందు ధరూర్ వద్ద ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. జగిత్యాల నియోజకవర్గ శ్రేణులు భయపడాల్సిన అవసరం లేదని, అందరినీ కాపాడుకుంటామని భరోసానిచ్చారు. నాయకులు పార్టీ మారినంత మాత్రాన పార్టీకి వచ్చే నష్టం ఏమీ లేదని, కార్యకర్తలు పటిష్టంగా ఉన్నారని చెప్పారు. కేసీఆర్ బొమ్మ పెట్టుకొని గెలిచి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పార్టీకి ద్రోహం చేశాడని, ప్రజలను వదిలి పెట్టిపోయారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు పోయిన ఆయనను ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. సంజయ్‌కుమార్ అసెంబ్లీ సమావేశాలకు ఏ ముఖం పెట్టుకొని పోతారో..? ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పార్టీ ఎందుకు మారారని అడిగితే 'పైసల కోసం మారాను' అని చెబుతున్నారన్నారు. అయితే జగిత్యాల మహిళలకు మహాలక్ష్మి పథకం వచ్చిందా..? వృద్ధాప్య పింఛన్లు పెరిగాయా..? రైతుబంధు వచ్చిందా..? కనీసం ఒక్క చెరువునైనా పూడిక తీశారా..? ఒక్క రూపాయి అయినా వచ్చిందా..? చెప్పాలని ప్రశ్నించారు. ఒక్క రూపాయి మంజూరు చేయనప్పుడు ఆయన పార్టీ ఎందుకు మారారో..? ఆయనే సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే పైసల కోసం పోయానంటున్నాడని, ప్రజలను వదిలి పైసల వెంట పడే వారు ఏనాటికి నాయకులు కాలేరన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్‌ను శ్రమించి గెలిపించారని, ఇప్పుడు పరిస్థితి ఏంటని విలేకరులు ప్రశ్నించగా, ఆయన పార్టీ మారినా జగిత్యాల ప్రజలు కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీతోనే ఉన్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వచ్చి జగిత్యాలలో ప్రచారం చేసినా.. ఆనాడు ఇక్కడి ప్రజలు కేసీఆర్ నిలబెట్టిన డాక్టర్ సంజయ్ కుమార్‌నే గెలిపించారన్నారు. ఆయనది వ్యక్తిగత గెలుపు కాదని, కేసీఆర్ గెలుపుగా చూడాలన్నారు. పార్టీని వదిలిపోయిన వారు పోయారని, రానున్న రోజుల్లో పార్టీ వెంట ఉన్నవారిలో ఎవరో ఒక్కరు ఎమ్మెల్యే అవుతారని చెప్పారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ వెంట మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, నాయకులు దావ సురేశ్, శివ కేసరి బాబు, దేవేందర్ నాయక్, తురగ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ అనూప్ రావు, మాజీ జడ్పీటీసీ రాంమోహన్‌రావు, శీలం ప్రియాంక ప్రవీణ్ ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



ధరూర్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

## 'కస్తూర్బా'లోనూ కామన్ డైట్ మెనూ పాటించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గురుకులాల్లో ఫుడ్‌పాయిజనింగ్ పెరిగింది. రాష్ట్రంలో ఏడాది కాలంలో 47 మంది చిన్నారులు విద్యాసంస్థలో చనిపోవడం అత్యంత బాధాకరం. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ చేపట్టిన గురుకుల బాటతో ప్రభుత్వంలో చలనం వచ్చింది. గురుకులాల్లో డైట్ మెనూను మార్చింది. కామన్ డైట్ మెనూను రూపొందించడంతోపాటు వాటికి నిధులను సైతం పెంచింది. శనివారం గురుకులాల్లో కామన్ డైట్ మెనూను ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నం. అలాగే ప్రజా వ్యతిరేకంగా తీసుకునే ప్రతి నిర్ణయంపైన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తం. అయితే గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ఆడపిల్లలు చదివే కస్తూర్బా పాఠశాలల్లోనూ కామన్ డైట్ మెనూను పాటించాలి. అలాగే సీఎం రేవంత్ రెడ్డి ఇది వరకే సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చినట్టు.. కస్తూర్బా టీచర్లందరినీ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలి.

- సారంగాపూర్ కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్‌లో అంతర్జాతీయ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ చెమన్‌సింగ్

# డాక్టర్ 'చెమన్'కు అంతర్జాతీయ పురస్కారం

జూలపల్లి, డిసెంబర్ 15 : జూలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన ప్రముఖ, కవి, రచయిత, డాక్టర్ చెమన్‌సింగ్‌కు వైద్య రంగంలో ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ అవార్డు దక్కింది. ఇటీవల ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ 'ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ కల్చర్ అండ్ డిప్లొమాటిక్ రిలేషన్' ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన తొమ్మిది మందిని ఎంపిక చేసి అవార్డులు ప్రకటించగా, అందులో ఆల్టర్నేటివ్ మెడిసిన్ విభాగంలో చెమన్‌కు చోటు దక్కింది. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో చెమన్ 'హ్యూమన్ రైట్స్ క్రూసడర్ అవార్డు-2024' అందుకున్నారు. ఆయన దాదాపు 30 ఏండ్ల నుంచి సాహిత్యం, వైద్య రంగాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మన్ననలు పొందుతున్నారు. కొన్నేండ్ల నుంచి హైదరాబాద్‌లో ఆయుర్వేద వైద్యుడిగా సేవలందిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయడానికి వినూత్న రీతిలో పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలో జర్మనీలోని ఇంటర్నేషనల్ 'పీస్' యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ పురస్కారం అందించగా, గతంలోనూ రెండుసార్లు ఉత్తమ డాక్టర్‌గా ఎంపికయ్యారు.



తిమ్మాపూర్: పరీక్ష రాసేందుకు సెంటర్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు

# 'గ్రూప్-2' మొదటి రోజు ప్రశాంతం

కరీంనగర్ కమాన్ చౌరస్తా, డిసెంబర్ 15 : గ్రూప్ 2 ఎగ్జామ్స్ మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో కొనసాగాయి. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు మాత్రమే లోనికి అనుమతించారు. అయితే కొందరు ఆలస్యంగా రాగా, అనుమతించలేదు. మరికొందరు మధ్యాహ్నం పరీక్షకు హాజరు కాలేదు. నేడు కూడా మొదటి రోజు వేళల్లోనే పరీక్షలు ఉండనుండగా, అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని, టీజీపీఎస్సీ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు.





ఫర్టిలైజర్‌సిటీ: 'ఖని'లో నిమిషం ఆలస్యంతో పరీక్ష రాయని అభ్యర్థులు

# అటవీ శాఖ అధికారులమని బెదిరించి..

ముస్తాబాద్, డిసెంబర్ 15 : అటవీశాఖ అధికారులమని బెదిరించి ఓ నలుగురు ₹20 వేలు వసూలు చేసి పరారయ్యారు. చివరకు పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. ఎస్‌ఐ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్‌కు చెందిన కోటా మహేశ్, దానవేణి ఎల్లన్న మూడు రోజుల క్రితం మాంసం విక్రయించడానికి ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామ శివారుకు వచ్చారు. అయితే దుబ్బాక మండలం పోతారం గ్రామానికి చెందిన గండికోట దేవరాజు (35), గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన గొల్లేని దేవరాజుతోపాటు మరో ఇద్దరు అక్కడకు వచ్చి, తాము ఫారెస్ట్ అధికారులమని, మీరు అటవీ జంతువు మాంసం విక్రయిస్తున్నారని బెదిరించారు. తమకు ₹20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో వారు భయపడి సెల్‌ఫోన్ ద్వారా ఆ మొత్తాన్ని పంపారు. అనంతరం స్థానికుల ద్వారా వచ్చినవారు అధికారులు కాదని తెలుసుకొని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు ఆ నలుగురిపై కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు. ఆదివారం గండికోట దేవరాజు, గొల్లేని దేవరాజును పట్టుకున్నారు. వారి నుంచి ₹20 వేలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు. అటవీ జంతువులను వేటాడినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రేషన్ బియ్యం పక్కదారి!

పేదల బియ్యం పక్కదారి పడుతున్నది. నిఘా కరువై దందా జోరుగా నడుస్తున్నది. పోలీస్ యంత్రాంగం తరచూ పట్టుకుంటున్నా అక్రమ రవాణా కొనసాగుతూనే ఉన్నది. ఇప్పటికే సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అనేక మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినా.. కొత్తకొత్త ముఠాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. కొందరు డీలర్లు అక్రమార్కులతో చేతులు కలుపడం వల్లే రేషన్ పక్కదారి పడుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తేనే దందాకు చెక్ పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- సిరిసిల్ల జిల్లాలో జోరుగా దందా!
- క్షేత్రస్థాయిలో కరువైన నిఘా
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- సర్వత్రా విమర్శలు



వేములవాడ మండలం సంకెపల్లి వద్ద రేషన్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఫైల్)

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : సిరిసిల్ల జిల్లాలో రేషన్ బియ్యం కార్డులు కలిగిన కుటుంబాలు 1,73,745 ఉండగా, 4,97,103 మందికి ఆరుకిలోల చొప్పున ప్రభుత్వం అందజేస్తున్నది. వీరి కోసం పౌరసరఫరాల శాఖ ప్రతినెలా 3,300 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 345 చౌకధరల దుకాణాల ద్వారా అందిస్తున్నది. అయితే క్షేత్ర సాయిలో పర్యవేక్షణ లేక రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా సాగుతున్నది. శతకోటి దరిద్రానికి అనంత కోటి ఉపాయాలన్నట్టు ఎంత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించినా అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. జిల్లా నుంచి రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మినీ వ్యాన్లతోపాటు లారీల్లో అక్రమ రవాణా జరుగుతుందనడానికి పోలీసులకు పట్టుబడుతుండడమే నిదర్శనంగా నిలుస్తున్నది. జిల్లాలో చందుర్తి, వేములవాడ, తంగళ్లపల్లి గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి అక్రమ దందా చేస్తున్నట్టు ఇప్పటికే విచారణలో వెలుగుచూస్తున్నది. జిల్లెల్ల గ్రామ కేంద్రంగా కొన్నేండ్ల నుంచి దందా సాగుతున్నట్టు పక్కా సమాచారంతో గుగులోతు పాండును పదిహేను రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకొని కూపీ లాగడంతో అక్రమ రవాణా విషయం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లెకు చెందిన పాండు జిల్లెల్లలో నివాసముంటూ, కొంత మంది వ్యక్తులతో ముఠాగా ఏర్పడి నాలుగేండ్లుగా దందా సాగిస్తున్నాడు. ఇతనిపై 14కేసులున్నా లెక్కచేయకుండా అనేక మందిని తయారు చేసి ఈ దందా సాగించినట్టు తెలిసింది. ఇటీవల పోలీసులు పాండును రిమాండ్‌కు పంపారు. ఇలా అక్రమ దందాకు చెక్ పెడుతున్నారు. జనవరి నుంచి ఇప్పటి వరకు 185 మందిని అరెస్ట్ చేశారు. 116 కేసులు నమోదు చేసి, 975.9 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నో వాహనాలను సీజ్ చేశారు. అక్రమ దందా ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్నా జిల్లా పౌరసరఫరాల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కులను పట్టుకుని పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా, స్థానిక పౌరసరఫరాల శాఖ ఎందుకు విచారణ చేపట్టడంలేదని, డీలర్లపై నిఘా ఎందుకు పెట్టడం లేదనే ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పటికైనా అక్రమ దందాకు చెక్ పెట్టి, పేదలకు న్యాయం చేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

